# హామీలు ప్రచారానికే పరిమితం

- అధినేత బాటలోనే అంతా..
- పెనమలూరు, గన్నవరం నియోజక వర్గాల ప్రగతి ప్రచారానికే పరిమితం
- వంద రోజులైనా ఒక్క సమస్యపైనా దృష్టి సారించని వైనం
- గత ప్రభుత్వంలో నిర్మించిన భవనాల ప్రారంభోత్సవాలకే పరిమితం
- 100 రోజుల పాలనపై పెదవి విరుపు

**కంకిపాడు:** సూపర్ సిక్స్‌తో అన్ని వర్గాలసంక్షేమం, సంపద సృష్టి అంటూ టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు చేసిన ప్రచారార్భాటం అందరికీ గుర్తే. అదే బాటలో ఎమ్మెల్యేలు కూడా ఉన్నారు. నియోజకవర్గం అభివృద్ధి, పెండింగ్ పనులపై దృష్టి, గతంలో ఎన్నడూ చూడని ప్రగతి అంటూ ప్రచారంలో ఊదరగొట్టి కనీసం ఒక్క సమస్య కూడా పరిష్కరించలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 100 రోజులు అయినా ఎక్కడి సమస్యలు అక్కడే ఉండటంతో పెనమలూరు నియోజకవర్గ ప్రజలు సర్కారు పాలనపై పెదవి విరుస్తున్నారు.

## రూ.19 కోట్ల నిధులు మంజూరైనా..

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మద్దూరు-ఉప్పలూరు రోడ్డుకు రూ.19 కోట్ల నిధులు మంజూరయ్యాయి. కూటమి సర్కారు అధికారంలోకి వచ్చింది. నిధులు మంజూరైన రోడ్డు నిర్మాణం త్వరితగతిన పూర్తి చేసి ప్రజల ఇక్కట్లను పరిష్కరించటంలో ప్రభుత్వం వైఫల్యం చెందిందన్న ఆరోపణలు ఉన్నాయి. ప్రొద్దుటూరు బీసీ కాలనీ ప్రధాన రహదారిని గెలిచిన నెల రోజుల్లో పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటానని బోడె ప్రసాద్ హామీ ఇచ్చారు. ఇప్పటికీ ఆ సమస్య పెండింగ్‌లోనే ఉంది. ఇలా నియోజకవర్గ వ్యాప్తంగా అనేక సమస్యలు పరిష్కారం కోసం ఎదురు చూస్తున్నాయి.


కంకిపాడులో ఎస్సీ సామాజికవర్గం ఏర్పాటుచేసిన సభలో మాట్లాడుతున్న ప్రస్తుత ఎమ్మెల్యే ప్రసాద్ (ఫైల్)

### ఇచ్చిన హామీలు ఇవీ..

కూటమి అభ్యర్థిగా బోడె ప్రసాద్ ఓ వైపు సూపర్ సిక్స్ గురించి ఇంటింటికీ ప్రచారం చేశారు. మరో వైపు గత టీడీపీ సర్కారులో పెండింగ్‌లో ఉన్న యనమలకుదురు, కుందేరు వంతెనలు ఏడాది లోగా పూర్తి చేయిస్తానని హామీ కూడా ఇచ్చారు. నియోజకవర్గంలోని ఉప్పలూరు, ఉప్పలూరు-కేసరపల్లి, ప్రొద్దుటూరు, గొడవర్రు, కంకిపాడు లాకుల ప్రాంతాల్లో వంతెనల అభివృద్ధికి నిధులు మంజూరు అయ్యేలా చర్యలు తీసుకుంటానన్నారు. పెండింగ్ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పాటుపడతానన్నారు. ఇప్పటికే 100 రోజుల పాలన పూర్తయ్యింది. పెండింగ్ సమస్యలపై దృష్టి పెట్టిన దాఖలాలు కనిపించటం లేదన్న విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి.

## ఇసుక రేవులపైనే దృష్టి..

పెనమలూరు, కంకిపాడు మండలాలు కేంద్రంగా ఉన్న ఇసుక రేవులు ఇసుక అక్రమ రవాణాకు అడ్డాగా మారాయి. అధికార పార్టీకి చెందిన కొందరు ముఖ్య నేతలే అక్రమ రవాణాను యథేచ్ఛగా సాగించారు. పెనమలూరు మండలంలోని ఏటి పాయ వెంబడి గ్రామాల ప్రజలు అక్రమ



పెనమలూరు అభివృద్ధిపై బోడె ప్రసాద్ ఇచ్చిన ఇంటర్వ్యూ (ఫైల్)

రవాణాను అడ్డుకోవటం, సాక్షిలో పలుమార్లు కథనాలు రావటంతో అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి రవాణాకు బ్రేక్ వేసిన ఘటనలు అనేకం. అయినా ఇంకా సందట్లో సడేమియాగా స్థానిక అవసరాల పేరుతో ఎడ్ల బండ్లపై ఇసుక తోలుకుని అడ్డదారిన తరలించేసి అధికార పక్ష నేతలు సొమ్ము చేసుకుంటున్నారన్న విమర్శలు ఉన్నాయి.

## గత ప్రభుత్వం నిర్మించిన భవనాల ప్రారంభోత్సవాలతో సరి..

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పౌర సేవలను ప్రజలకు దరిచేర్చేందుకు గ్రామ గ్రామానా సచివాలయాలు, రైతుభరోసా కేంద్రాలు నిర్మించింది. నిర్మాణం పూర్తయిన పలు భవనాలను ఎమ్మెల్యే బోడె ప్రసాద్ తన చేతులమీదుగా ప్రారంభోత్సవం చేసి ప్రజలకు అందుబాటులోకి తెచ్చారు.

### ఒక్క సమస్యా పరిష్కరించ లేదు



మా గ్రామం కుందేరు. గ్రామంలో నిర్మాణం ఆగిపోయిన బ్రిడ్జి ఉంది. శ్మశాన వాటిక అభివృద్ధి జరగటం లేదు. ఈ సమస్యలపై ఎన్నికల్లో బోడె ప్రసాద్ హామీ ఇచ్చారు. గెలిచాక ఆయా ప్రాంతాలకు వచ్చి సమీక్షించింది గానీ, ఫైలు కదిలింది గానీ లేదు. సమస్యలతో ఇబ్బందులు పడుతున్నాం. 100 రోజుల పాలనలో నియోజకవర్గంలో ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయి.

–గోగులమూడి రాజు, మాలమహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడు, కుందేరు గ్రామం

### హామీలు నెరవేర్చలేదు



ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు నేటికీ అమలు చేయలేదు. సూపర్‌సిక్స్ పేరుతోఅనేక పథకాలు ప్రకటించారు. మహిళలకు ప్రకటించిన గ్యాస్‌సిలెండర్లు, ఉచిత బస్సు, అమ్మకు వందనం వంటి పథకాల ఊసేలేదు. భవిష్యత్తులో పథకాలు అమలు చేస్తారన్న నమ్మకం కలగటం లేదు. ఇచ్చిన మాట ప్రకారం పథకాలు అమలు చేయాలి.

–అప్సర్‌జహా, సనత్‌నగర్, కానూరు, పెనమలూరు

# అడుగు ముందుకు పడని హామీలు

**గన్నవరం:** గత ఎన్నికల్లో కూటమి సూపర్ సిక్స్ పథకాలంటూ విస్తృత ప్రచారం చేసింది. గెలిచిన 100 రోజులకు కూడా అవి అమలుకు నోచుకోలేదు. గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు కూడా గెలుపు కోసం సూపర్ సిక్స్ పేరుతో నియోజకవర్గ ప్రజలకు ఆరు వాగ్దానాలు చేశారు. అధికారంలోకి వచ్చి వంద రోజులు గడుస్తున్నా ఈ హామీల అమలుకు అడుగులు ముందుకు పడలేదు.

## ఇచ్చిన హామీలు ఇవీ..

- అసంపూర్తిగా నిలిచిపోయిన బ్రహ్మయ్య లింగయ్య చెరువును రిజర్వాయర్‌గా మార్చి, పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసి సాగు, తాగునీటి సమస్యలు తీర్చుతానని యార్లగడ్డ ఇచ్చిన హామీపై మెట్ట ప్రాంత రైతులు ఆశలు పెట్టుకున్నారు. గతంలో పలు ప్రభుత్వాలు, ప్రజాప్రతినిధులు ఈ చెరువును రిజర్వాయర్‌గా మార్చేందుకు చేసిన ప్రయత్నాలు ముందుకు సాగలేదు. ఈ నేపథ్యంలో ఎన్నికల లబ్ధి కోసం చేసిన వాగ్దానాన్ని ఎమ్మెల్యే ఎంతవరకు నెరవేర్చుతారనే అనుమానాలు ఆయకట్టు రైతాంగంలో ఉంది. ఏలూరు కాలువపై రామవరప్పాడు, ఎనికేపాడు వద్ద వంతెనల నిర్మాణంపై ఇచ్చిన హామీ పురోగతి లేదు.
- నియోజకవర్గంలో 15 వేల మందికి ఇళ్ల స్థలాలు ఇస్తానని హామీతో ఎన్నికల ముందు ప్రజలను నమ్మబలికారు. ఎన్నికల ముందే గ్రామ కమిటీల ద్వారా పేదల నుంచి ఇళ్ల స్థలాల కోసం దరఖాస్తులు కూడా స్వీకరించారు. తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత ఇళ్ల స్థలాలపై ఎక్కడా ప్రస్తావించక పోవడంపై పేదల్లో అయోమయం నెలకొంది.
- మల్లవల్లి పారిశ్రామికవాడలో పరిశ్రమలు ఏర్పాటు చేసి 15 వేల మందికి ప్రత్యక్షంగా, మరో ఐదు వేల మందికి పరోక్షంగా ఉపాధి కల్పిస్తాననే యార్లగడ్డ హామీ ఆచరణకు నోచుకోలేదు. పారిశ్రామికవేత్తలతో చర్చలు మినహా పరిశ్రమల స్థాపన దిశగా అడుగులు పడలేదు.
- బండారుగూడెం వద్ద పోలవరం కుడి కాలువ నుంచి ఏలూరు కాలువకు అనుసంధాన ప్రాజెక్ట్‌ను చేపట్టి డెల్టా ప్రాంత రైతుల సాగునీటి కష్టాలను తీర్చుతాననే హామీ ప్రకటనలకే పరిమితమైంది.
- నియోజకవర్గంలో బహుళజాతి ఐటీ కంపెనీలను ఏర్పాటు చేసి యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తాననే హామీ ఎప్పటికి నెరవేరుతుందని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.



సూపర్‌సిక్స్ హామీల కరపత్రం

## అందుబాటులో అంతంతమాత్రమే..

ఎమ్మెల్యేగా యార్లగడ్డ వెంకట్రావు విజయం సాధించిన తర్వాత నియోజకవర్గ ప్రజలకు పెద్దగా అందుబాటులో ఉండడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మొదట విజయవాడలో తన ఇంటిని క్యాంప్ ఆఫీస్‌గా మార్చి అక్కడి నుంచే పర్యవేక్షించారు. అధికారులతో సమీక్షలు, పార్టీ నేతల సమావేశాలు కూడా అక్కడే. దీంతో ప్రజల నుంచి అసంతృప్తి వ్యక్తమవడంతో గన్నవరంలో మరో క్యాంప్ ఆఫీస్ ఏర్పాటు చేశారు. ఇక్కడ వారానికి రెండు రోజులు మాత్రమే ఎమ్మెల్యే అందుబాటులో ఉండడంతో ప్రజలకు ఎంతవరకు మేలు జరుగుతుందని నేతలే ప్రశ్నిస్తున్నారు. ప్రజా సమస్యలను పరిష్కరించడంలో గత ఎమ్మెల్యేలతో పోల్చితే యార్లగడ్డ వ్యవహారశైలి భిన్నంగా ఉందనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.


బ్రహ్మయ్య లింగయ్య చెరువు


మల్లవల్లి పారిశ్రామికవాడ

### వంతెనలు నిర్మించాలి



అసెంబ్లీ ఎన్నికల ముందు ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ఇచ్చిన హామీ మేరకు ఏలూరు కాలువపై రామవరప్పాడు, ఎనికేపాడు వద్ద వంతెనలు నిర్మించాలి. కాలువకు అవతల పంట పొలాలు ఉండడంతో కాలువను దాటుకుని వెళ్లి సాగు చేసుకోవాల్సిన పరిస్థితి. ఎనికేపాడులో ఏలూరు కాలువపై బల్లకట్టుపై ఆధారపడి రైతులు, ఆ ప్రాంత ప్రజలు ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని రాకపోకలు సాగిస్తున్నారు.

–మెండె సుధాకర్, రామవరప్పాడు

### సాగునీటి ఇబ్బందులు తీర్చాలి



పోలవరం కుడి కాలువను ఏలూరు కాలువకు అనుసంధానం చేయడం వల్ల డెల్టా ప్రాంత రైతులకు ఎంతో మేలు జరుగుతుంది. డెల్టా ఆయకట్టు స్థిరీకరణకు ఎంతగానో ఉపయుక్తంగా ఉంటుంది. దీనిపై ఎన్నికల ముందు ఇచ్చిన హామీని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు నిలబెట్టుకోవాలి. బండారుగూడెం వద్ద ప్రస్తుతం ఉన్న డ్రెయిన్‌ను అభివృద్ధి చేయడం ద్వారా పోలవరం కుడి కాలువ, ఏలూరు కాలువ అనుసంధానం చేయవచ్చు. ఆ దిశగా ప్రభుత్వం దృష్టి సారించాలి.

–పడకల శ్రీనివాసరావు, కాపులపాడు

### వాగ్దానం అమలు చేయండి..



మెట్ట ప్రాంత రైతుల సాగునీటి కష్టాలను తీర్చేందుకు ఎన్నికల వాగ్దానం మేరకు బ్రహ్మయ్య లింగయ్య చెరువును రిజర్వాయర్‌గా మార్చాలి. దీనివల్ల ఆయకట్టు రైతులతో పాటు పలు గ్రామాల రైతులకు సాగునీరు అందుతుంది. కొండల మధ్య ఉన్న చెరువు ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేయాలి. ఇచ్చిన హామీలు అమలు చేయాలి.

–చిట్టినేని రామ్మోహన్‌రావు, చిక్కవరం

## క్లుప్తంగా

### 24 నుంచి మండల స్థాయి స్కూల్‌గేమ్స్

**కంకిపాడు:** మండల స్థాయి స్కూల్ గేమ్స్, క్రీడాకారుల ఎంపిక పోటీలు ఈనెల 24వ తేదీ నుంచి 27వ తేదీ వరకూ నిర్వహించనున్నట్లు ఎంఈఓ-2 కేఎస్‌వీ ప్రసాద్ తెలిపారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. అండర్-14కు 1-1-2011 తరువాత జన్మించిన వారై ఆరో తరగతి నుంచి ఇంటర్మీడియెట్ రెండో సంవత్సరం చదువుతూ ఉండాలని, అండర్-17కు 1-1-2008 తరువాత జన్మించిన వారై ఆరో తరగతి నుంచి ఇంటర్మీడియెట్ రెండో సంవత్సరంలోపు చదువుతూ ఉండాలన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు, రెసిడెన్షియల్ విద్యాసంస్థల విద్యార్థులు పాల్గొనవచ్చన్నారు. ఈనెల 24న కోలవెన్ను జెడ్పీ పాఠశాలలో చెస్, యోగా పోటీలు ఉంటాయన్నారు. 25న నెప్పల్లి జెడ్పీ పాఠశాలలో వాలీబాల్, కబడ్డీ పోటీలు నిర్వహిస్తారన్నారు. 26న జెడ్పీ పాఠశాల కంకిపాడులో బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహిస్తారన్నారు. 27న ఈడుపుగల్లు జెడ్పీ పాఠశాలలో ఖోఖో, అథ్లెటిక్స్ పోటీలు జరుగుతాయన్నారు. పోటీల్లో ప్రతిభ చాటిన క్రీడాకారులను ఎంపిక చేసి ఈనెల 28న ఉయ్యూరులో నిర్వహించే నియోజకవర్గ స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

### క్వారీ తవ్వకాల పరిశీలన



**విజయవాడరూరల్:** విజయవాడ రూరల్ మండలం పాతపాడు, పి.నైనవరం గ్రామాల్లో శుక్రవారం విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్ మెంట్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. మైనింగ్ శాఖ నుంచి తీసుకున్న పర్మిషన్ ప్రకారం కాకుండా అక్రమంగా జరిగిన క్వారీ తవ్వకాలపై అధికారులు తనిఖీలు చేశారు. విజిలెన్స్ ఏజీ సుధాకర్ టీమ్ అధికారులు సర్వే నిర్వహించారు. తనిఖీల్లో విజిలెన్స్ ఎన్ఫోర్స్‌మెంట్ అధికారులతో పాటు గ్రామ రెవెన్యూ అధికారి రఘుబాబు కూడా ఉన్నారు.

### ఓజోన్ పరిరక్షణ మనందరి బాధ్యత




**రామవరప్పాడు:** రాబోయే తరాలకు మంచి పర్యావరణాన్ని, ఆరోగ్యాన్ని అందించాలంటే ఓజోన్‌ను మనందరం పరిరక్షించుకోవాలని రామవరప్పాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఎస్‌ఏ తాయారు అన్నారు. విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడు జెడ్పీ పాఠశాలలో శుక్రవారం ఓజోన్ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తాయారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఓజోన్ పరిరక్షణకు కృషి చేయాలన్నారు. ఇంటి పరిసరాల్లో మొక్కలు నాటాలని, ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలన్నారు. పలు పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో నేషనల్ గ్రీన్ కారప్స్ క్లస్టర్ కోఆర్డినేటర్ సాయి రున్నీసా బేగమ్, గ్రీన్ టీచర్ నాగలక్ష్మి, డి.ఆంథోని రాజులు పాల్గొన్నారు.

# అంగన్‌వాడీల్లో అమ్మకు వందనం

**రామవరప్పాడు:** విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడు అంగన్‌వాడీ కేంద్రంలో మహిళాభివృద్ధి శిశుసంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం అమ్మకు వందనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ చిన్నారులు వారి మాతృమూర్తులకు పాదపూజ చేశారు. ఈ సందర్భంగా పాదాభివందనం చేసిన చిన్నారులకు అక్షింతలు వేసి తల్లులు ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ స్వర్ణకుమారి మాట్లాడుతూ నవమాసాలు మోసి కనిపెంచి, కంటికి రెప్పలా కాపాడుతున్న తల్లి గొప్పతనం చిన్నారులు తెలుసుకోవాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అసోసియేట్ కిన్నెర, తల్లులు పాల్గొన్నారు.

**సామూహిక సీమంతాలు**

**పెనమలూరు:** పెనమలూరులో శుక్రవారం సామూహిక సీమంతాలు చేశారు. గ్రామంలో అంగన్‌వాడీ-1లో పౌష్టికాహార మాసోత్సవాలలో భాగంగా గర్భిణులకు సీమంతాలు చేసి పండ్లు, పౌష్టికాహారం అందజేశారు. ఈ సందర్భంగా సీడీపీవో బేబీ సుకన్య మాట్లాడుతూ తల్లులు, గర్భిణులు, చిన్నారులు పౌష్టికాహారం తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటారన్నారు. ప్రభుత్వం అందించే పౌష్టికాహారంతో పాటు ఆకుకూరలు, పండ్లు తినాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ కె.శ్రీలత, వైద్యశాఖ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.


తల్లులకు పాదాభివందనం చేసి ఆశీర్వాదం తీసుకుంటున్న చిన్నారులు


పెనమలూరులో సామూహిక సీమంతాలు చేస్తున్న అధికారులు

# విద్యార్థులకు అందుబాటులో విలువైన సమాచారం

**ఏపీ జనాభా గణన శాఖ సంచాలకుడు బాలకిరణ్**

**మొగల్రాజపురం(విజయవాడ తూర్పు):** ఆంధ్రప్రదేశ్ జనాభా గణన శాఖలో పీబీ సిద్ధార్థ కళాశాల మధ్య కుదిరిన ఒప్పందం వల్ల విద్యార్థులకు, పరిశోధనలు చేసే వారికి, పీహెచ్‌డీ చేసే వారికి ఎంతో విలువైన సమాచారం అందుబాటులో ఉంటుందని ఆంధ్రప్రదేశ్ జనాభా గణన శాఖ సంచాలకుడు పి.బాలకిరణ్ చెప్పారు. సిద్ధార్థ కళాశాల ఆవరణలోని వెబ్‌నార్ హాలులో ఏపీ జనాభా గణన శాఖ, సిద్ధార్థ కళాశాల మధ్య ఒప్పంద పత్రాల మార్పిడి కార్యక్రమం శుక్రవారం జరిగింది. కళాశాల డైరెక్టర్ వేమూరి బాబూరావు, డీన్ రాజేష్ సి.జంపాల, కళాశాల సాంఖ్యాక శాస్త్ర విభాగాధిపతి జి.చక్రవర్తితో పాటుగా జనాభా గణన శాఖ డైరెక్టరేట్‌లోని ఉప సంచాలకుడు శివకుమార్ ఒప్పంద పత్రాలను మార్పిడి చేసుకున్నారు. ఈ ఒప్పందం వల్ల తమ కళాశాలలోని విద్యార్థులతో పాటుగా పీహెచ్‌డీ చేసే వారు ఎవరికైనా ఏ విధమైన సమాచారం కావాలన్నా సులభంగా తెలుసుకోవచ్చని చెప్పారు. ఏపీ జనాభా గణన శాఖతో ఒప్పందం కుదుర్చుకున్న మొదటి కళాశాల ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తమదేనని రమేష్ చెప్పారు. ఈ జనాభా గణాంకాల వివరాలను తెలుసుకోవడానికి ప్రత్యేకంగా ల్యాబ్‌ను కూడా కళాశాల ఆవరణలో సిద్ధం చేశామని రమేష్ చెప్పారు.


ఒప్పంద పత్రాలను చూపిస్తున్న ప్రిన్సిపాల్ ఎం.రమేష్, బాలకిరణ్ తదితరులు

# నటుడు అక్కినేనికి స్వర నీరాజనం

**విజయవాడ కల్చరల్:** సినీ నటుడు అక్కినేని నాగేశ్వరరావు శత జయంతి సందర్భంగా గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో శ్రీ ఘంటసాల కళాసమితి, శ్రీలలిత కళా స్రవంతి ఆధ్వర్యంలో శుక్రవారం సినీ సంగీత విభావరి, వివధ రంగాలకు చెందిన వారికి ఆత్మీయ సత్కార కార్యక్రమం నిర్వహించారు. గాయకుడు పీవీఎస్ఎస్ శర్మ ఆధ్వర్యంలో గాయనీ గాయకులు గుడిపాటి హరికృష్ణ కొప్పరపు ఉమాబలరాం, కొమ్మినేని రత్నకుమారి, పవన్‌కుమార్ తదితరులు అక్కినేని చిత్రగీతాలను ఆలపించారు. వివిధ రంగాలకు చెందిన అబంటి మధుమోహన కృష్ణ, జ్యోతిష్య శాస్త్రవేత్త ప్రసూనా రామన్ అమర్‌నాథ్, సంజీవరావు, పద్మావతీ శర్మ పాల్గొని అక్కినేని జీవిత విశేషాలను వివరించారు. మిమిక్రీ కళాకారుడు సిల్వర్‌స్టర్, గాయని దుర్గా సౌజన్యను, గుడిపాటి హరి కృష్ణ ఆత్మీయంగా సత్కరించారు.

**అక్కినేని స్మారక పురస్కారాలు..**

స్వరలయ సాంస్కృతిక సేవా సంస్థ, జాషువా కళావేదిక ఆధ్వర్యంలో అక్కినేని నాగేశ్వరరావు శత జయంతి సందర్భంగా మొగల్రాజపురంలోని పీవీ సిద్ధార్థ కళాశాలలో శుక్రవారం సినీ సంగీత విభావరి, గాయనీ గాయకులకు అక్కినేని స్మారక పురస్కారాల ప్రదాన కార్యక్రమం నిర్వహించారు. గాయనీ గాయకులు రసూల్‌బాబు, రామకృష్ణ, ఎస్.అఖిలకు అక్కినేని పురస్కారాలను అందించారు. కార్యక్రమంలో గోళ్ల నారాయణ రావు, స్వరలయ నిర్వాహకులు ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.


అక్కినేని గీతాలు ఆలపిస్తున్న గాయనీ గాయకులు

## వంట సామగ్రి పంపిణీ

**హనుమాన్‌జంక్షన్ రూరల్:** లయన్స్‌క్లబ్ ఆఫ్ హనుమాన్‌జంక్షన్, కమ్మవారి ఐక్య సేవా సమితి సంయుక్త ఆధ్వర్యంలో వరద బాధితులకు శుక్రవారం వంట సామగ్రి పంపిణీ చేశారు. బాపులపాడు మండలంలోని పలు గ్రామాలు వరద ముంపునకు గురి కావటంతో బాధితులకు స్టీలు వంట సామాన్లు పంపిణీ చేశారు. దాదాపు 200 కుటుంబాలకు వంట సామగ్రి అందజేసినట్లు కమ్మవారి ఐక్య సేవా సమితి అధ్యక్షుడు పరుచూరి రామకృష్ణ తెలిపారు. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి తమవంతు సాయం అందించటం అభినందనీయమని ఏపీయూడబ్ల్యూజే జిల్లా ఉపాధ్యక్షుడు అట్లూరి రాజశేఖర్ అన్నారు. లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు క్లోపల్లి నారాయణరావు, సభ్యులు అక్కినేని ఫణీంద్ర పాల్గొన్నారు.

## గ్రామాల్లో కనిపించని ‘ఇది మంచి ప్రభుత్వం’

**అంబాపురం(విజయవాడరూరల్):** కూటమి ప్రభుత్వం ఏర్పడి వంద రోజులైన సందర్భంగా శుక్రవారం నుంచి గ్రామాల్లో నిర్వహించతలపెట్టిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం గ్రామాల్లో మచ్చుకైనా కనిపించలేదు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ ఇంటింటికెళ్లి పార్టీ నాయకులు, సచివాలయ సిబ్బంది కరపత్రాలను అందజేసే కార్యక్రమం జరుగలేదు. కూటమిలో పార్టీ నాయకుల సమన్వయం లోపం కారణంగా 'ఇది మంచి ప్రభుత్వం' అనే కార్యక్రమం నిర్వహించలేక పోయినట్టు ఆ పార్టీ నాయకులే అంటున్నారు.

## హామీలు అమలు చేస్తున్నాం

**పెనమలూరు:** గత ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేస్తున్నామని ఎమ్మెల్యే బోడెప్రసాద్ అన్నారు. పెనమలూరు గ్రామంలో శుక్రవారం కూటమి 100 రోజులు పూర్తి చేసిన సందర్భంగా ఇది మంచి ప్రభుత్వం అనే కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించి ఇంటింటి ప్రచారం చేశారు. కొత్తగా పింఛన్‌లు, రేషన్‌కార్డులు ఇవ్వాలని గ్రామస్తులు కోరారు. గ్రామ సర్పంచి లింగాల భాస్కరరావు, ఎంపీడీవో సునీతాశర్మ ఏవో లోయ శివశంకర్‌రావు, తహసీల్దార్ కె.గోపాలకృష్ణ, టీడీపీ నేతలు మారుపూడి ధనకోటేశ్వరరావు, అనుమోలు ప్రభాకరరావు, కోయా ఆనందప్రసాద్, తోటకూర ఉదయ భాస్కర్, కిలారు శ్రీనివాసరావు, షేక్‌సైదులు, పలువురు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

**పెనమలూరు:** గోసాల వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలవటంతో పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వణుకూరుకు చెందిన గండ్రపు పోతురాజు డ్రైవర్‌గా పని చేస్తాడు. అతనికి భార్య సరిత ఇద్దరు పిల్లలు. కాగా అతను ఉదయం గోసాల సెంటర్ రోడ్డు దాటుతున్న సమయంలో కంకిపాడు నుంచి విజయవాడ వైపునకు వెళుతున్న కారు అతి వేగంగా వచ్చి ఢీ కొట్టింది. ఈ ఘటనలో పోతురాజు తలకు, కాళ్లకు గాయాలు అయ్యాయి. అతనిని విజయవాడలోని ఆస్పత్రికి తరలించారు. భార్య సరిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

## బస్సు అద్దాలు పగలకొట్టిన వ్యక్తి అరెస్ట్

**కంకిపాడు:** మద్యం తాగి బస్సును అడ్డగించి బస్సు అద్దాలు పగలకొట్టిన వ్యక్తిని కంకిపాడు పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. ఎస్‌ఐ డి.సందీప్ తెలిపిన కథనం మేరకు..వన్నే విష్ణువర్ధన్‌రావు ఆర్టీసీ డ్రైవరు. ఈనెల 19వ తేదీ సాయంత్రం గుడివాడ డిపో నుంచి విజయవాడకు బస్సు నడుపుతూ వస్తుండగా కోమటిగుంట లాకుల వద్ద మద్యం తాగి ఉన్న వడ్డె క్రాంతి బస్సును అడ్డగించి బస్సు అద్దాలు పగలకొట్టాడు. ఆర్టీసీ డ్రైవరు విష్ణువర్ధన్‌రావును తీవ్రంగా దుర్భాషలాడాడు. డ్రైవరు ఇచ్చిన ఫిర్యాదుపై శుక్రవారం కేసు నమోదు చేసిన పోలీసులు బస్సు అద్దాలు పగలకొట్టిన క్రాంతిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

# కాలువ కట్ట.. వేసెయ్ పాగా

- వైకుంఠపురంలో బందరు కాలువ కట్టపై ఆక్రమణల పరంపర
- అవినీతి మత్తులో అధికారులు

**పెనమలూరు:** ప్రభుత్వ ఖాళీ స్థలాలు కనబడితే చాలు తెలుగు తమ్ముళ్లకు పండుగలా ఉంది. గోసాల వైకుంఠపురంలో రైతన్నలకు సాగునీరు అందిస్తున్న బందరు కాలువ కట్టను యథేచ్ఛగా ఆక్రమించి నిర్మాణాలు చేస్తున్నారు. ప్రభుత్వ స్థలాలు పరిరక్షించాల్సిన రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు అవినీతి కంపుతో నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

**బందరు కాలువ కట్టపై..**

గోసాల వైకుంఠపురంలో బందరు కాలువ కట్టపై అత్యంత విలువైన ఖాళీ స్థలం ఉంది. ఇప్పటికే ఈ ప్రాంతం పై టీడీపీ నేతలు కళ్లు పడ్డాయి. గత కొద్ది రోజుల క్రితం వంతెన వద్ద రెండు బడ్డీ కొట్లు పెట్టి స్థలం ఆక్రమించారు. ఆ తరువాత కాలువ కట్టపై విలువైన స్థలం ఆక్రమించి ఇల్లు కట్టారు. దీనిపై మీడియాలో వార్తలు రాగా ఇంటి నిర్మాణం కొద్ది రోజులు ఆపి గుట్టు చప్పుడవ్వకుండా ఇంటి నిర్మాణం పూర్తి చేశారు.

ఇప్పుడు మరలా కాలువ కట్టపై ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి మరో ఇల్లు కట్టే పనిలో ఉన్నారు. పట్టపగలే బాహాటంగా ప్రభుత్వ స్థలం ఆక్రమించి ఇంటి నిర్మాణం చేస్తున్నా ప్రలోబాల కారణంగా ఇరిగేషన్ అధికారులు, రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శలు వస్తున్నాయి.


వైకుంఠపురంలో బందరు కాలువ కట్ట ఆక్రమించి ఇంటి నిర్మాణ పనులు చేస్తున్న దృశ్యం

**పచ్చనేతల రియల్ వ్యాపారం..**

వైకుంఠపురంలో బందరు కాలువ కట్టను పచ్చ నేతలు ఆక్రమించి స్థలాలు ముక్కలు ముక్కలుగా అమ్మి కాసులు సంపాదిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమిస్తున్నా అధికారులు ఎందుకు స్పందించటంలేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. సిఫార్సులతో బదిలీపై వచ్చిన అధికారులు ఏమి చర్యలు తీసుకోగలుగుతారని ఎద్దేవా చేస్తున్నారు. అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు ఉంటే వైకుంఠపురంలో ఇక ప్రభుత్వ స్థలం అనేది మిగలకుండా పచ్చనేతలు అమ్మేసుకుంటారని స్థాకులు ఆరోపిస్తున్నారు. ఈ వ్యవహారంలో అధికారులు స్పందించక పోతే తాము సైతం ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి ఇళ్లు నిర్మించుకుంటామని తెలుపుతున్నారు.

## దాడి కేసులో వ్యక్తి అరెస్ట్

**హనుమాన్‌జంక్షన్ రూరల్:** పాత కక్షల నేపథ్యంలో బాపులపాడు మండలం కొయ్యూరుకు చెందిన ఓ వ్యక్తిపై హత్యాయత్నం చేసిన వ్యక్తిని హనుమాన్‌జంక్షన్ పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. గ్రామానికి చెందిన పలగాని హరీష్, పలగాని సాయికృష్ణ ఇద్దరూ వరుసకు అన్నదమ్ములు. వీరిద్దరి మధ్య గత కొంతకాలంగా గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో గురువారం రాత్రి పాత కొయ్యూరు వాటర్ ట్యాంక్ వద్ద పలగాని హరీష్‌ను అడ్డగించిన సాయికృష్ణ దాడికి పాల్పడ్డాడు. ఇనుపరాడ్డుతో తలపై బలంగా కొట్టడంతో తీవ్రంగా గాయపడ్డ హరీష్‌ను కుటుంబ సభ్యులు ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆస్పత్రి వర్గాల నుంచి అందిన సమాచారంతో హనుమాన్‌జంక్షన్ పోలీసులు బాధితుడు హరీష్ నుంచి వాగ్మూలం స్వీకరించారు. దాడికి పాల్పడిన పలగాని సాయికృష్ణను ఎస్‌ఐ ఏడీఎల్ జనార్దన్ అరెస్ట్ చేసి నూజివీడు కోర్టుకు తరలించారు.